

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 26 అక్టోబరు 2025





రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కడప క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధిక వర్షపాతం కురిసే అవకాశం ఉన్నందున సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు.

ఉపాధి పనులకు ఇంటింటి సర్వే

కడప ఎన్జీఆర్ సర్కిల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులను గుర్తించడానికి ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులు గుర్తించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని గ్రామీణ మండలాల్లో ఈ నెల 27 నుంచి నవంబరు 1 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో ఏపీవోలు, ఈసీలు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు, జేఈలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొని ప్రతి ఒక్క ఉపాధి హామీ కూలీ ఇంటిని సందర్శించనున్నారు. ఉపాధి హామీ వంద శాతం అందిస్తున్న 27 రకాల పండ్ల, పూల మొక్కలను నాటుకోవడానికి రైతుల్లో అవగాహన తీసుకురావడంతో పాటు వారి వివరాలను ఈ సర్వేలో సేకరిస్తారు. ప్రస్తుతం ఇంటి ఆవరణలో మురుగు కాల్వలు లేని వారికి ప్రతి ఇంటికీ కంపోస్టుపిట్ ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తారు. ఈ పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపిన వారి వివరాల ఆధారంగా ఉపాధి హామీ ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి ప్రజలను కోరారు.

బద్వేలు చెరువుకట్టపై

క్షుద్రపూజల కలకలం



బద్వేలు చెరువుకట్టపై గుర్తుతెలియని వ్యక్తులు చేసిన క్షుద్రపూజలు

బద్వేలుటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బద్వేలు చెరువుకట్టపై శనివారం క్షుద్రపూజలు కలకలం రేపాయి. కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు చెరువుకట్టపై ముగ్గువేసి నిమ్మకాయలు, టెంకాయలు, ఓ మహిళ ఫొటో పెట్టి క్షుద్రపూజలు చేసిన సంఘటన వెలుగులోకి రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. క్షుద్రపూజల్లో మహిళ ఫొటోను సూదితో గుచ్చి ఉండటంతో దీనిని చూసిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి ఘటన మూడు రోజుల క్రితం ఎర్రగుంట్లలో జరిగింది. అక్కడ ఓ ఇంటిముందు క్షుద్రపూజలు చేసి చిన్నబొమ్మను, నిమ్మకాయ కుంకుమ వేశారు. అది మరువకముందే బద్వేలు చెరువుకట్టపై క్షుద్రపూజలు కనిపించాయి. క్షుద్రపూజలు చేస్తూ అందరినీ భయాందోళనకు గురిచేస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మొంథా తుఫాను నేపథ్యంలో..

జిల్లాకు రూ.కోటి నిధులు



(కడప-ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో అత్యవసర సేవల కోసం రాష్ట్రప్రభుత్వం రూ.కోటి నిధులు జిల్లాకు కేటాయించింది. ఆదివారం నుంచి నాలుగురోజుల పాటు మొంథా తుఫాను తీవ్రస్థాయిలో ఉండనున్నట్లు వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తుఫాను ప్రభావిత 11 జిల్లాలకు మొత్తం రూ.14 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా మన జిల్లాకు రూ.కోటి కేటాయించారు. తుఫాను నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల నుంచి బాధితులను శిబిరాలకు తరలించడం, తాగునీరు, ఆహారం సరఫరా చేయడం, పిల్లలు వృద్ధులు, మహిళలకు పాలు పంపిణీ, వైద్యశిబిరాలు, పరిసరాల పరిశుభ్రత, రవాణా, ఇతరత్రా వసతుల కోసం ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. ప్రభుత్వపాఠశాలలు, కాలేజీలను తుఫాను షెల్టర్లుగా వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

2600 టన్నుల యూరియా

కడప రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 2600 టన్నుల యూరియా వచ్చినట్లు వ్యవసాయశాఖ జిల్లా అధికారి బి.చంద్రానాయక్ వెల్లడించారు. శనివారం కడపలోని యూరియా పాయింట్‌ను పరిశీలించారు. జిల్లాకు కేటాయించిన యూరియాలో 780 టన్నులు ప్రైవేటు డీలర్లకు, ఏపీ మార్కెటింగ్ ద్వారా 1400 టన్నులు రైతు సేవా కేంద్రాలకు కేటాయించారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదన్నారు.

జలకళ



● ఉమ్మడి జిల్లాలో నిండుకుండలా జలాశయాలు

● ప్రాజెక్టుల నీటి సామర్థ్యం 82.255 టీఎంసీలు
● ఇప్పటికే 71.767 టీఎంసీలు
● నిండుతున్న చెరువులు

(కడప-ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని రిజర్వాయర్లకు నీరు చేరుతోంది. ఎడతెగని వర్షాలు కురుస్తుండడంతో అటు భారీ ప్రాజెక్టులే కాదు ఇటు చెరువులు కూడా నిండిపోతున్నాయి. దీంతో రబీలో సాగునీటికి లోటే ఉండదు. అలాగే వచ్చే వేసవిలో కూడా తాగునీటి ఎద్దడి ముప్పు తప్పినట్లేనని అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పూర్తిస్థాయి ప్రధాన ప్రాజెక్టుల నీటి సామర్థ్యం 82.255 టీఎంసీలు అయితే శనివారం నాటికే 71.767 టీఎంసీల నీరు జలాశయాల్లో ఉంది. సోమవారం నుంచి మొంథా తుపాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. ఇది 26, 27, 28, 29 తేదీల్లో తీవ్ర ప్రభావం చూపనుందని వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్ జారీ చేసింది. దీంతో సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్, ఎస్పీలతో శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా ప్రభావం మన జిల్లాపై ఉంటే ఇక ప్రాజెక్టులన్నీ పూర్తిస్థాయి నీటి మట్టంతో జలకళ సంతరించుకోనున్నాయి.

జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో చెరువులు నింపాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో 500 పెద్ద చెరువులు ఉంటే ఇప్పటికే 257 చెరువులు నింపారు. ఇక కుంటలు, చిన్నచెరువులు కలుపుకుని మరో 539 దాకా ఉంటాయి. ఇవి కూడా వర్షాలకు నిండుతున్నాయి.



వామికొండ జలాశయం

తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో 122 చెరువులున్నాయి. వీటిలో తెలుగుగంగ నీటిని 73 చెరువులకు పూర్తిస్థాయిలో నీటిపారుదలశాఖ అధికారులు నింపారు. 23 చెరువులు 75 శాతం నిండగా మరో పది చెరువులు 50శాతం నిండాయి. రానున్న వర్షాలతో ఈ చెరువులన్నీ నిండనున్నాయి. రబీలో సుమారు 3 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. వరి, పత్తి, మొక్కజొన్న, శెనగ, వేరుశెనగ, కంది, ఇతర పంటలు సాగు కానున్నాయి. రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండలా ఉండడంతో డైరెక్టు ఆయకట్టుతో పాటు వ్యవసాయ బోర్ల కింద సాగు పెరగనుంది. నీరు పుష్కలంగా ఉన్న కారణంగా తాగునీటి ఎద్దడి ఉత్పన్నం కాదు. వేసవి వచ్చిందంటే చాలు కడప నగరంతోపాటు పోరుమామిళ్ల, కలసపాడు, జమ్మలమడుగులో తాగునీటి సమస్య తలెత్తేది. ఇప్పుడు ఎటుచూసినా జలాశయాలు, చెరువుల్లో నీళ్లే కనిపించడంతో రానున్న వేసవిలో తాగునీటి సమస్య ఉండదని భావిస్తున్నారు.

ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలు టీఎంసీలల్లో..

ప్రాజెక్టు పేరు	సామర్థ్యం	ప్రస్తుతం
బ్రహ్మంసాగర్	17.735	15.282
ఎస్ఆర్-1	2.134	1.77
ఎస్ఆర్-2	2.447	1.953
గండికోట	26.85	26.295
సీబీఆర్	10.229	9.013
మైలవరం	6.5	5.589
ఎల్ఎస్‌పీ	0.169	0.1
బుగ్గవంక	0.506	0.345
వెలిగల్లు	4.64	3.622
పింఛా	0.327	0.327
పైడిపాలెం	6	5.124
వామికొండ	1.658	1.353
సర్వరాయసాగర్	3.06	0.994
మొత్తం	**82.255**	**71.767**

కుందూనదిలో దూకి..

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

● భార్య గల్లంతు.. భర్త క్షేమం



నదిలో దూకిన వృద్ధుడిని కాపాడిన గురప్ప



రామసుబ్బారెడ్డితో మాట్లాడుతున్న తహసీల్దారు మనోహర్‌రెడ్డి, ఎస్ఐ కత్తి వెంకటరమణ

రాజుపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో విసిగిపోయిన వృద్ధ దంపతులు కుందూ నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేశారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దముడియం మండలం ఉప్పలూరుకు చెందిన గొంగటి రామసుబ్బారెడ్డి, నాగమునెమ్మ దంపతులు శనివారం ఉదయం వెల్లాల గ్రామంలోని సంజీవరాయస్వామి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం కుందూ నది వద్ద గంగమ్మకు పూజలు చేశారు. అనంతరం ఇద్దరూ నదిలో దూకేశారు. గమనించిన స్థానికులు పెద్దమొత్తల గురప్ప, గ్రామ రెవెన్యూ సహాయకులు వెంటనే నదిలో దూకి రామసుబ్బారెడ్డిని రక్షించారు. అప్పటికే నాగమునెమ్మ ప్రవాహంలో కొట్టుకుపోయారు. అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది బోట్ల సాయంతో సాయంత్రం 5 గంటల వరకు నదిలో వెతికినా ఆమె జాడ దొరకలేదు. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న తహశీల్దారు మనోహర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటరమణ వృద్ధుడు రామసుబ్బారెడ్డిని విచారణ చేశారు. తనకు ఇద్దరు కొడుకులున్నారని, ఆస్తిపాస్తులు కూడా ఉన్నాయని అన్నాడు. వృద్ధాప్యం బీపీ, షుగరు ఎక్కువగా ఉండడంతో భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా.. దాదాపు 30 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు తెలిసినా.. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కుందూలో దూకి రామసుబ్బారెడ్డిని పెద్దమొత్తల గురప్ప రక్షించారు. దీంతో అతడిని స్థానికులు అభినందించారు.

కోర్టుల్లో ఉన్న కేసులపై ఎస్పీ సమీక్ష



మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో నమోదై కోర్టుల్లో వివిధ దశల్లో ఉన్న కేసులకు సంబంధించిన పలు విషయాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన ముఖ్యమైన కేసుల్లో దర్యాప్తు మొదలు కోర్టుల్లో ఆ కేసులు పూర్తయ్యేంత వరకు వచ్చే విషయాలపై, సాంకేతిక లోటుపాట్లతో కేసులు వీగిపోకుండా నిందితులకు శిక్షలు పడేందుకు తీసుకోవలసిన చర్యలు, కేసులు ఫైలింగ్ చేసే విధానం తదితర విషయాలను చర్చించారు. తీవ్రమైన నేరాల్లో కోర్టు విచారణ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. పోలీసు అధికారులు కేసుల దర్యాప్తులు, ట్రయల్స్‌ను వేగవంతం చేయాలని నిందితులకు వారంట్లు, సమన్లను సత్వరమే అమలుపరిచి సాక్షులను సరైన బ్రీఫింగ్‌తో కోర్టులో హాజరు పరచాలని అన్నారు. కోర్టు ట్రయల్ ప్రతి దశలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులు సమన్వయంతో గుడ్‌ట్రయల్ మానిటరింగ్ చేస్తూ కేసుల్లో శిక్ష పడేవిధంగా చూడాలన్నారు. కోర్టు లైజాన్ సిబ్బంది పోలీసుస్టేషన్‌కు, న్యాయస్థానాలకు మధ్య అనుసంధానంగా నిబద్ధతతో పనిచేయాలన్నారు. కోర్టుకు సంబంధించిన ఎలాంటి రికార్డులు పెండింగులో పెట్టవద్దని, ఎప్పటికప్పుడు రికార్డులు చెక్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఖదీరున్‌బీ, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, జిల్లాకు సంబంధించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

భారీ వర్ష సూచన

● జిల్లాకు రెడ్ అలర్ట్
● అన్ని డివిజన్లలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
● రేపు, ఎల్లుండి పాఠశాలలకు సెలవు ● ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్



ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆమె అధికారులతో మాట్లాడుతూ ప్రాజెక్టులు, జలాశయాలు, చెరువులు, కాలువలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తుఫాన్ కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. వాగులు, వంకలు, కుంటల వద్ద ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో పిల్లలు, యువకులు నీటి వద్దకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత వారం కురిసిన వర్షాలకు కుందూ-పెన్నా పరివాహక ప్రాంతాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కొన్ని నిర్మాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలో ఎక్కడా పశు నష్టం జరగకుండా అధకారులు చర్యలు తీసుకోవాలన్నారు. కడపతో పాటు అన్ని రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలు, అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే కలెక్టరేట్‌లోని 08562-246344, కడప ఆర్డీవో కార్యాలయంలో 08562-295990, జమ్మలమడుగు 9502836762, బద్వేలు 6301432849, పులివెందుల 8919134718 నెంబర్లకు కాల్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని, ఫిర్యాదులు చేయవచ్చని వివరించారు. అలా.. జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం 27, 28 తేదీల్లో తీవ్రంగా ఉండే అవకాశాలు ఉన్నందున జిల్లా అంతా రెడ్ అలర్ట్ జారీ చేశామని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్ హాల్లో తుఫాను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆర్డీవోలు, మండలాధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. 27, 28 తేదీల్లో తుఫాన్ ప్రభావం వల్ల ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు, అంగనాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు.

రేపు పీజీఆర్ఎస్ రద్దు

కడప కలెక్టరేట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుఫాన్ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను తాత్కాలికంగా రద్దు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల వారెవరూ పీజీఆర్ఎస్ నిమిత్తం కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

ధరలేక దైన్యం

● ఉల్లిగడ్డలు పొలంలోనే వదిలేస్తున్న రైతులు



రైతు పొలంలోంచి ఉల్లిగడ్డలు ఏరుకుంటున్న మహిళలు

చాపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేసేవారు కరువయ్యారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న ఆశ నిరాశగా మారింది. ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చిందన్న ఉత్సాహం.. కొనుగోలు చేసేవారు లేక పోవడంతో నీరుగారి పోయింది. చాపాడు మండలంలోని వెదురూరు, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె పరిధిలో సుమారు 75 ఎకరాల్లో ఉలి (ఎర్రగడ్డలు) సాగు చేయగా, నెల రోజుల క్రితం కోతకొచ్చింది. కానీ, పంటను కొనుగోలు చేసేవారు లేకపోవడంతో రైతులు పంట కోయకుండా ఇప్పటివరకూ ఎదురుచూశారు. అయినా ఫలితం లేకపోవగా, ప్రస్తుతం భూమిలోని ఉల్లిగడ్డలు మొలకెత్తుతున్నాయి. దీంతో కొంతమంది రైతులు పంటను పొలంలోనే వదిలివేస్తున్నారు. వి.రాజుపాళెం గ్రామంలో శివ అనే రైతు ఒకటిన్నర ఎకరాలో ఉల్లిపంటను శనివారం పొలంలోనే వదిలేశాడు. దీంతో గ్రామంలోని మహిళలు ఎర్రగడ్డలను తవ్వుకుని సంచుల్లో, బుట్టల్లో ఇళ్లకు తీసుకెళ్లారు.

ప్రైవేటు బస్సులపై కొరడా

● ఫైర్ సేఫ్టీ, ఎమర్జన్సీ డోరు లేని వైనం
● తనిఖీల్లో వెల్లడి



ప్రైవేటు బస్సును తనిఖీ చేస్తున్న రవాణా అధికారులు

(కడప-ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలో కావేరీ ట్రావెల్స్ బస్సు దుర్ఘటనతో రవాణా శాఖ అధికారులు మేల్కొన్నారు. జిల్లా నుంచి 70 ప్రైవేటు బస్సులు నిత్యం హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ లాంటి ప్రధాన నగరాలకు వెళుతుంటాయి. ఇందులో స్లీపర్ బస్సులున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో సరైన మెయింటెనెన్స్ లేకపోవడంతో ప్రైవేటు బస్సులనే ఆశ్రయిస్తున్నారు. అయితే రవాణా చార్జీలపై ఉన్న ప్రేమ ప్రయాణికుల భద్రతపై ట్రావెల్స్ యాజమాన్యాలకు లేదు. దీంతో ఇవి ప్రమాదాలకు గురవుతూ వస్తున్నాయి. చాలా వరకు ప్రైవేటు బస్సులు కనీస నిబంధనలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ఫిట్‌నెట్ సర్టిఫికెట్, ఇన్సురెన్స్ లేకుండానే అడ్డగోలుగా తిప్పుతున్నారు. కర్నూలు దుర్ఘటనతో ప్రభుత్వ ఆదేశాల మేరకు రవాణా శాఖాధికారులు ప్రైవేటు బస్సులను తనిఖీలు చేశారు. జిల్లా వ్యాప్తంగా రవాణా అధికారులు తనిఖీ చేయగా 54 బస్సులు నిబంధనలకు వ్యతిరేంగా తిరుగుతున్నట్లు గుర్తించారు. కడపలో 10 బస్సులు, ప్రొద్దుటూరు 9, బద్వేలు 9, పులివెందుల 6 మొత్తం 34 బస్సుల్లో ప్రమాదం జరిగినప్పుడు అగ్నిని ఆపే యంత్రాలు, అత్యవసర సమయాల్లో బయట పడేందుకు ఎమర్జన్సీ డోర్లు లేవు. డోర్లున్నా పనిచేయడం లేదని గుర్తించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో తప్పనిసరిగా రెండో డ్రైవరు ఉండాలి. అయితే ఇక్కడ ఒక డ్రైవరుతో తిప్పుతున్నారు. 34 బస్సుల్లో అగ్నిప్రమాద నివారణ పనిముట్లు లేవని, మరో 19 బస్సుల్లో రెండో డ్రైవరు లేకపోవడంతో కేసులు నమోదు చేశామని ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ ఎం.వీర్రాజు వెల్లడించారు.

మదనపల్లెలో గంజాయి ముఠా..!



- పోలీసుల అదుపులో 40 మంది
- ఆయా పోలీస్‌స్టేషన్లలో విచారణ
- ఎక్కువ మంది వైసీపీ మద్దతుదారులు
- వదిలేయాలని పోలీసులపై ఒత్తిడి

మదనపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో గంజాయి ముఠా హల్‌చల్ చేస్తోంది. వీరిపై నిఘా పెట్టిన పోలీసులు అంచెలంచెలుగా 40 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మదనపల్లె వన్‌టౌన్, టూటౌన్, తాలూకా పోలీస్‌స్టేషన్, డీఎస్పీ బంగ్లా సహా కురబలకోట మండలం ముదివేడు పోలీస్‌స్టేషన్లకు వీరిని తిప్పుతూ పోలీసులు విచారణ చేస్తున్నారు. గంజాయి విక్రయదారులు, సరఫరా, వినియోగదారులు ఇందులో ఉన్నట్లు చెబుతున్నారు. మదనపల్లె పట్టణం సైదాపేట, బెంగళూరు బస్‌స్టాండు, ఇందిరానగర్, బసినికొండ, నక్కలదిన్నె, నీరుగట్టువారిపల్లె సహా కురబలకోట మండలం అంగళ్లు, తంబళ్లపల్లె ఏరియాలకు చెందిన నిందితులు, అనుమానితులు ఉన్నారు. వీరిలో పలు పార్టీలకు చెందిన ద్వితీయశ్రేణి నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులు ఉండగా, ఎక్కువగా వైసీపీ వారే ఉన్నట్లు తెలిసింది. విచారణలో భాగంగా వీరందరినీ ఆయా పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతున్న క్రమంలో బాధితుల బంధువులు, కుటుంబీకులు, స్థానికంగా ఉన్న రాజకీయ నేతలు వీరిని గంజాయి చెర నుంచి విడిపించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాజకీయ నేతలు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. అయితే పోలీసులు మాత్రం తమకున్న సమాచారంతో విచారణ మాత్రమే చేస్తున్నామని, ఇందులో పాతనేరస్తులు కూడా ఉన్నట్లు చెప్పి పంపుతున్నారు. బాధితులే కాదు, నిందితుల్లో కళాశాల విద్యార్థులు, నాటుసారా తాగేవారు, రోజువారీ కూలీలు, లారీడ్రైవర్లు ఉన్నారు. మరోవైపు వైసీపీ మద్దతుదారులు, కార్యకర్తలు పోలీసుల అదుపులో ఉన్నారు. వీరిని విచారించే క్రమంలో నిందితులిచ్చే సమాచారం ఆధారంగా విక్రేతలు, వినియోగదారులు, సరఫరాదారులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుల విచారణలో చెప్పిన వివరాల మేరకు పోలీసులు...స్థానిక సైదాపేట, బెంగళూరు బస్టాండు ఏరియాల్లో కొందరి అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఆగ్రహించిన నిందితులు.. సమాచారం ఇచ్చారనే అనుమానంతో కొందరిపై దాడికి దిగినట్లు తెలిసింది. ఇలా పంచాయితీ చివరకు పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి వారిని వదిలేయాలని పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. విశాఖ, అరకు, కృష్ణ, విజయనగరం, తదితర ప్రాంతాల నుంచి గంజాయి సరఫరా చేస్తూ, కొందరు స్థానికంగా యువతకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిచ్చిన సమాచారం మేరకు పెద్దఎత్తున అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మదనపల్లె నుంచి టమోటాల సరుకులోడుతో వెళ్తున్న లారీలు తిరిగి వచ్చేటపుడు ఆ డ్రైవర్లతో మాట్లాడుకుని అక్కడి నుంచి ఇక్కడికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు గమనించిన పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని ఆయా ప్రాంతాల్లో గంజాయి వాడకం ఎక్కువైనట్లు చెబుతున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ వ్యసనానికి అలవాటుపడి జీవితాన్ని చిత్తు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి విక్రయం, వాడడం, దానివల్ల కలిగే అనర్థాలపై పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు అవగాహనా సదస్సులు నిర్వహించినా చాపకిందనీరులా గంజాయి విక్రయాలు కుటీర పరిశ్రమగా విస్తరించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. కలకడకు చెందిన ఓ వ్యక్తి దగ్గర 4 కేజీల గంజాయి దొరికింది. ఇతడి ద్వారా తీగ లాగితే డొంక కదిలినట్లు మదనపల్లె గంజాయి ముఠాను అరెస్టు చేసినట్లు తెలిసింది.

ఏరువాక సేవలు విస్తరించాలి



కంది పంటను పరిశీలిస్తున్న విస్తరణ సంచాలకులు శివనారాయణ

సీకేదిన్నె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏరువాక సేవలను విస్తరించి రైతుల అభివృద్ధికి పాటుపడాలని ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ పేర్కొన్నారు. జిల్లాలో మూడవ రోజు పర్యటనలో భాగంగా ఏరువాక కేంద్రాన్ని శనివారంసందర్శించి అక్కడ జరుగుతున్న సాంకేతిక కార్యక్రమాల అమలు, విస్తరణ కార్యక్రమాల ప్రగతి, రైతులకు అందజేస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని జమాల్‌పల్లి గ్రామంలో వరి పంటను పరిశీలించి అందులో లోపాలు గుర్తించి రైతులకు సమగ్ర చర్యలు, సూచనలు ఇచ్చారు. అనంతరం మైదుకూరు మండలం అన్నలూరు గ్రామంలో సాగు చేస్తున్న వరి, కంది పంటలను సందర్శించి క్షేత్రస్థాయిలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ క్రిష్ణప్రియ, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీల దొంగ అరెస్టు



బ్యాటరీ దొంగను చూపుతున్న సీఐ, ఎస్ఐ

ఎర్రగుంట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆపివున్న లారీల నుంచి బ్యాటరీలను చోరీచేసే దొంగల ముఠాను ఎర్రగుంట్ల పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకెళితే.... ఎర్రగుంట్ల మున్సిపాలిటీ ప్రొద్దుటూరు బైపాస్‌రోడ్డులో ఈ నెల 21న తన లారీ ఆపి ఉండగా రెండు బ్యాటరీలను చోరీ చేసినట్లు చిలమకూరుకు చెందిన ఫక్రుబాష పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సీఐ కే.విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నాగ మురళి పోట్లదుర్తి-ఆర్టీపీపీ రోడ్డులో శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. బ్యాటరీల చోరీకి పాల్పడే బుక్కే రవీంద్రనాయక్‌ను అనుమానాస్పదంగా ఉండడంతో అరెస్టు చేసినటు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.60వేలు విలువ చేసే నాలుగు బ్యాటరీలు, రూ.3లక్షల విలువచేసే షిఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జమ్మలమడుగు మండలం బొమ్మేపల్లె తాండకు చెందిన బుక్కే నాయక్ వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేసేవాడని, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, దువ్వూరు, పెద్దముడియం, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాల్లో మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి చోరీలకు పాల్పడినట్లు తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరు...



విలేకరుల సమావేశంలో వెల్లడిస్తున్న పోలీసులు

పులివెందుల అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తొండూరు, ఇతర మండలాల్లో దొంగతనాల కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తొండూరు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు. నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం గోవిందిన్నె గ్రామానికి చెందిన హిదయతుల్లా, జమ్మలమడుగు బీసీ కాలనీకి చెందిన గైబుసావల్లి చెడు వ్యవసనాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఈనెల 21వ తేదీ మల్లేల గ్రామంలోని మసీదులోని హుండీని పగలగొట్టి రూ.30వేలు నగదు చోరీ చేశారు. శుక్రవారం భద్రంపల్లి క్రాస్‌లో అనుమానాస్పదంగా ఉండగా అరెస్టు చేసి, విచారణ చేయగా దొంగతనానికి సంబంధించి వివరాలు బయటపడినట్లు తెలిపారు. కొన్ని నెలల క్రితం ప్రకాశం జిల్లా అర్థవీడు, పులివెందుల, మైలవరం, తొండూరు మండలాల్లో పలు ఆలయాల్లో హుండీలు పగలగొట్టి నగదు చోరీ చేసినట్లు తేలిందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప టూటౌన్ పరిధిలో ఇంట్లో వారితో గొడవపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ట్రాఫిక్ ఎస్ఐ సకాలంలో అంబులెన్స్ రప్పించి హాస్పిటల్‌కు తరలించారు. వివరాలిలా.. శుక్రవారం అర్థరాత్రి 2గంటల సమయంలో నైట్‌రౌండ్స్‌లో విధుల్లో ఉన్న ఎస్ఐ జయరాముడు టూటవున్ పరిధిలో వెళుతున్న దారిలో జియారాఫంక్షన్ హాలు సమీపంలోని ఓ ఇంట్లో పీరుల్లా (29) అనే వ్యక్తి మద్యం మైకంలో ఇంట్లో వారితో గొడవపడి కొబ్బరినూనె, సన్‌స్క్రీన్ లోషన్ తాగేశాడు. ఆపై ఇంట్లోని అద్దాన్ని చేతితో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం అంబులెన్స్ కోసం రోడ్డుపై ఉండడం గమనించిన ఎస్ఐ జయరాముడుకు విషయం తెలపడంతో వెంటనే 108కు ఫోను చేసి అంబులెన్స్ తెప్పించి రిమ్స్‌కు తరలించే ఏర్పాటు చేశారు.

వైద్యం వికటించి వివాహిత మృతి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెంచయ్యగారిపల్లెలో శనివారం సాయంత్రం వైద్యం వికటించి బాలగాని రమాదేవి(43) అనే వివాహిత మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వారి కథనం మేరకు... రమాదేవి అనారోగ్యంగా ఉండడంతో గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడికి చూపించుకోవడానికి వెళ్లగా ఆయన ఇంజక్షన్ ఇవ్వడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతురాలి భర్త బ్రహ్మంగారిమఠం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డబ్బులు స్వాహా చేశాడని ఫిర్యాదు

పోరుమామిళ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని జైకిసాన్ జంక్షన్ మేనేజర్ మల్లాల నారాయణరెడ్డి రైతుల నుంచి వసూలు చేసిన డబ్బులు స్వాహా చేశాడని కంపెనీ సిబ్బంది ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన నారాయణరెడ్డి రైతుల నుంచి వసూలు చేసిన అమౌంట్‌లో కొంత మొత్తం బ్యాంకులో జమచేసి మిగిలిన రూ.7,55,592 స్వాహా చేశాడని ఆడిట్లో తేలింది. దీంతో అతనిపై ఆ కంపెనీకి చెందిన టి.శ్రీను అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుష్పగిరి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం

- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మంత్రి ఆనం, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, రితేశ్‌రెడ్డిలను ఆశీర్వదిస్తున్న అర్చకులు

వల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరిక్షేత్రానికి పూర్వ వైభవం వచ్చేలా.. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆహ్వానం మేరకు పుష్పగిరిక్షేత్రాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా దేవస్థాన ఈవో శ్రీనివాసులు, ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీరాజ్యాలక్ష్మి సమేత చెన్నకేశవ, సంతాన మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుష్పగిరికి సంబంధించి సమస్యలను దేవదాయ రీజనల్ జాయింట్ కమిషనరు ఆజాద్ చంద్రశేఖర్‌తో పాటు స్థానిక భక్తులు మంత్రికి వివరించారు. పెన్నానది ఉధృతంగా ప్రవహించే సమయంలో పుష్పగిరి కొండపైన ఉన్న చెన్నకేశవుని దర్శించుకోవాలంటే కష్టంగా ఉంటుందని, ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. అలాగే పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆర్కియాలజీ కమిషనరుతో మాట్లాడారు. వంతెన నిర్మాణానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు యువనేత రితీష్‌రెడ్డి ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డిలను ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీవో రఘురాం, టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు క్రిష్ణారెడ్డి, రమణారెడ్డి, జయసుబ్బారెడ్డి, శివశంకర్‌రెడ్డి, రమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, శివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, దేవదాయ, పురావస్తుశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగల బ్యాగును పోగొట్టుకున్న వృద్ధ దంపతులు

- సీసీ కెమెరాల సాయంతో అప్పగింత



బాధితులకు వస్తువులు అప్పగిస్తున్న సీఐ ఓబులేసు


కడప క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆటోలో వెళుతూ రూ.8లక్షల విలువైన బంగారు, వెండి నగలున్న బ్యాగును పోగొట్టుకొని వృద్ధ దపంతులు బస్సు ఎక్కారు. ఆ వెంటనే గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇందుకు స్పందించి కేవలం గంటలోనే తిరిగి అప్పగించి శభాష్ పోలీస్ అంటూ ప్రజలచే అభినందనలు అందుకున్నారు చిన్నచౌకు పోలీసులు. వివరాలిలా.. కడప నగరం శ్రీనగర్ కాలనీలో నివాసం ఉన్న దాసరి సంటెన్న (65), దాసరిగంగులమ్మ (60) దంపతులు శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వారి మనవడితో కలిసి నంద్యాలలో ఉన్న కుమారుడు డాక్టర్ రమేశ్ ఇంటికి వెళ్లడానికి ఇంటి వద్ద నుంచి ఆటోలో బస్టాండుకు చేరుకున్నారు. అప్పటికే స్టాండులో బస్సు పోయేందకు సిద్ధంగా ఉండడంతో గాబరాగా బంగారాన్ని ఉంచిన బ్యాగును ఆటోలో మరిచిపోయి బస్సు ఎక్కారు. కొంత సేపటికి బ్యాగు లేదనే విషయాన్ని గుర్తించిన ఆ దంపతులు బస్టాండు అవుట్ పోస్టులో ఉన్న కానిస్టేబుల్ రవిప్రకాశ్‌రెడ్డిని ఆశ్రయించారు. వెంటనే విషయాన్ని చిన్నచౌకు పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టరు ఓబులేసుకు తెలుపగా సిబ్బందిని అప్రమత్తం చేశారు. కానిస్టేబుల్ రవిప్రకాశ్‌రెడ్డి, బ్లూకోల్ట్స్ సిబ్బంది ఆర్టీసీబస్టాండు పరిసర ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించి ఆటోను పాత బైపాస్ రోడ్డులో గుర్తించి మొత్తం 8 తులాలు బంగారు, 15 తులాల వెండి ఆభరణాలు ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చిన్నచౌకు ఇన్‌స్పెక్టరు ఓబులేసు ఆధ్వర్యంలో వృద్ధ దంపతులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

భార్యాభర్తలు కలిసి ఉంటామన్నందుకు...

- కౌన్సెలింగ్ కేంద్రం వద్ద పెద్దల రభస

కడప ఎన్జీఆర్ సర్కిల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు కలిసి ఉంటామన్నందుకు దాడికి పాల్పడిన ఘటన శనివారం కలెక్టరు కార్యాలయంలోని డీ బ్లాక్‌లో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలిలా.. ముద్దనూరు మండలం కొర్రపాడుకు చెందిన అమ్మాయికి అదే మండలం ఓబులాపురానికి చెందిన అబ్బాయికి ఆరు నెలల కింద పెద్దల అంగీకారం మేరకు వివాహం జరిగింది. ఇంతలో చిన్నపాటి సమస్య రావడంతో వీరి పంచాయతీ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటరుకు చేరింది. ఈ క్రమంలో దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి సర్దుబాటు చేశారు. కానీ అబ్బాయి తరపు వారు నిరాకరించారు. తమ మాట వినాలంటూ రచ్చ చేయడంతో పాటు అబ్బాయిపై దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు వారందరినీ పోలీసు స్టేషన్‌కు తరలించి దాడికి పాల్పడిన వారిని మందలించి పంపించారు.

మహిళ అదృశ్యం



సిద్దవటం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళ మిస్సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. మండ లంలోని డేగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన అమ్మన్ని (59)కి మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 22న మధ్యాహ్నం 2 గంటల సమయంలో పశుగ్రాసం కోసం పెన్నానది సమీపాన ఉన్న పొలా ల్లోకి వెళ్లి తిరిగి రాలేదని ఆమె కుమారుడు పెసల మల్లికార్జున పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అధ్యాపకురాలు మహేశ్వరి ఆత్మహత్య



ప్రొద్దుటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూ రు మండలం ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చెందిన పల్లా మహేశ్వరి (26) అనే యువతి ఇంట్లో ఉరి వేసు కొని ఆత్మహత్య చేసు కున్న ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మహేశ్వరి చాపాడు మండలం పల్లవోలు వద్ద గల ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలుగా పనిచేస్తోంది. మహేశ్వరి చిన్నప్పుడే అమ్మానాన్న చనిపో యారు. దీంతో ఆమె అక్క వనితతో కలిసి తాత దగ్గర పెరి గారు. ఇద్దరు ఇంజనీరింగ్ చదివారు. వనితకు మూడు నెలల క్రితం వివాహం కావడంతో హైదరాబా దులో ఉంటోంది. దీంతో ఒంటరి తనం భరించలేక మాన సికంగా కలతచెంది ఇంట్లో వున్న మేడపై గల రేకుల గదిలో పైపు లకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు అక్క వనిత వన్‌టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ ఎస్ఐ సంజీవ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరివేసుకొని సచివాలయ ఉద్యోగిని మృతి



మల్లీశ్వరి (ఫైల్ ఫొటో)

బద్వేలుటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలోని కోటిరెడ్డినగర్‌లో భర్త రామనరసారెడ్డితో కలసి నివశిస్తున్న మన్యం మల్లీశ్వరి(28) అనే సచివా లయ ఉద్యోగిని శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బంధువుల వివరాల మేరకు.. బి.కోడూరు మండలం తంగేడుపల్లె సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా మల్లీశ్వరి విధులు నిర్వహిస్తుండేది. భర్త రామనరసారెడ్డి రామాపురంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరికి మూడేళ్ల క్రితం వివాహమైంది. ఏమైందో ఏమో తెలియదుకానీ మల్లీశ్వరి విధులు ముగించుకొని శనివారం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చింది. భర్త ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు వేసి ఉండటంతో అనుమానం వచ్చి డోర్‌ను పగుల కొట్టి చూశాడు. అయితే అప్పటికే ఫ్యాన్‌కు ఉరివేసుకున్న భార్యను చూసి విలవిలాడిపోయాడు. వెంటనే స్థానికు లకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మల్లీశ్వరి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువు

ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభం



మాట్లాడుతున్న శివనారాయణ

రాయచోటిటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం సాగుతో రైతుకు లాభం, మనిషికి ఆరోగ్యంతో పాటు భూమికి మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని సుద్దల వాండ్లపల్లె రోడ్డులో గల ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో రెండో రోజు జరిగిన ఎంఎఫ్‌టీ శిక్షణా కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్, వ్యవసాయాధికారి శివనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ ఎఫ్ఎంటీలుగా ఎంపికైన ఏపీ సీఎన్ఎఫ్ క్యాడర్ సభ్యులు తమ పొలాల్లో 365 రోజుల గ్రీన్ కవరేజ్ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతిని అనుసరించి భూమి సారవంతాన్ని పెంచుకోవాలని సూచించారు. అలాగే ఏటీయం మోడల్ అమలు చేసి నెలకు రూ.25 వేల నుండి రూ.30 వేల వరకు ఆదాయం పొందవచ్చునన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా స్థాయి, మండల స్థాయి సీనియర్ ఏపీసీఎన్ఎఫ్ క్యాడర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని డీఎస్సీ మైదానంలో శనివారం బాస్కెట్‌బాల్ ఎంపికలు జరిగాయి. జిల్లాలో క్రీడాకారులు దాదాపు 150 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వి.చంద్రావతి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఇజ్రాయిల్, సుబ్బయ్య, గణేశ్, విశ్వనాథ్, సుబ్బమ్మ, ఉమా, సుభద్ర పాల్గొన్నారు.

సీబీఐటీ సీఎస్ఈ విభాగానికి ఎన్‌బీఏ గుర్తింపు

చాపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు సీబీఐటీ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) వర్తిస్తుందని ఎన్‌బీఏ బోర్డు తెలిపింది. ఈ గుర్తింపు 2028 వరకు కొనసాగుతుందని కళాశాల చైర్మన్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ గుర్తింపు పట్ల చైర్మన్‌తో పాటు సీఈవో వి.లోహిత్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్, అడ్మిన్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.శృతి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం హర్షం వెలిబుచ్చారు.

ఘనంగా శ్రవణరాజ్ పుట్టిన రోజు వేడుక



కేక్ కట్ చేస్తున్న శ్రవణ్‌రాజ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మాధవి

(కడప - ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ రెడ్డప్పగారి మాధవి, టీడీపీ కడపజిల్లా అధ్యక్షుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి తనయుడు టీడీపీ యువ నాయకుడు, కడప క్రికెట్ స్టేడియం చైర్మన్ రెడ్డప్పగారి శ్రవణ్‌రాజ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలో పలుచోట్ల అన్నదానం, కేక్ కట్‌చేశారు. ఉదయం దేవునికడపలో వేంకటేశ్వరస్వామిని తల్లితో కలిసి దర్శించుకున్నారు. సాయంత్రం కడప నగరం ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో లోమడ మనోజ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ 20వ డివిజన్ ఇన్‌ఛార్జ్ లోమడ చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి, నగర అధ్యక్షుడు మన్సూర్ ఆలీఖాన్, అమర్‌నాథ రెడ్డి, శివారెడ్డి, ద్వారకనాథరెడ్డి, రెడ్డయ్యయాదవ్, పోలిరెడ్డి, వెంకటసుబ్బయ్య, శ్రీధర్, వంశీ, బాబాషరీఫ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



సమస్యలు వింటున్న రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పులివెందులలోని పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కోరారు.ఎమ్మెల్సీ స్వగృహం వద్ద శనివారం కలిసి సమస్యలు విన్నవించారు.అందుకు ఆయన స్పందిస్తూ సంబంధిత మంత్రి తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సెక్యూరిటీ సిబ్బంది నిరసనకు సీపీఐ మద్దతు

సింహాద్రిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోమడ వద్ద గల టాటా సోలార్ ఎనర్జీ ప్లాంటు సెక్యూరిటీ సిబ్బంది కార్మిక చట్టాల ప్రకారం జీతాలు పెంచాలని శాంతియుతంగా చేస్తున్న నిరసనకు సీపీఐ మద్దతు పలికింది. ఈ సందర్భంగా సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు మాట్లాడుతూ 2017 నుంచి పనిచేస్తున్న సోలార్ సెక్యూరిటీ సిబ్బందికి ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, శ్రమకు అనుగుణంగా తక్షణమే జీతాలు పెంచాలని ఆయన డిమాండు చేశారు. కార్యక్రమంలో సింహాద్రిపురం మండల సీపీఐ కార్యదర్శి అమీర్ బాషా, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలతల పాలకమండలి ప్రమాణ స్వీకారం

● హాజరైన దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి



మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డిని సన్మానిస్తున్న పాలకమండలి సభ్యులు

పెండ్లిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం శనివారం మల్లికార్జునస్వామి సన్నిధిలో అట్టహా సంగా సాగింది. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో ఆలయ పాలకమండలి చైర్మన్‌గా శిరిగిరెడ్డి రాజారెడ్డితో ఆలయ ఈఓ కృష్ణానాయక్ ప్రమాణ స్వీకారం చేయించారు. మొదట ఈఓ, ఆలయ అర్చకులు వీరికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. పొలతల క్షేత్రంలో రూ.4.90 కోట్ల నిధులతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్‌తో పొల తల పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గం లోని 90 ఆలయాలకు ధూపదీప నైవేద్యం నిధులను విడుదల చేశారు. పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుం దన్నారు. పాలక మండలి సభ్యులుగా నారాయణ రెడ్డి, సరస్వతి, లక్ష్మీదేవి, చిన్నపుల్లయ్య, శ్రీనివాసులు, రామాంజనేయులు, స్రవంతి, బి.లక్ష్మీదేవి, కృష్ణవేణి, చెంచమ్మ, అర్చక ఎక్స్‌అఫిషియో మెంబరుగా చంద్రశేఖర్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జ్ రితేష్‌రెడ్డి, విజయమ్మ, జనసేన ఇన్‌చార్జి వేణుగోపాల్‌రెడ్డి బీజేపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌రెడ్డి మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి పాల్గొన్నారు.

4000క్వింటాళ్ల సబ్సిడీ శనగలు మంజూరు

పులివెందుల టౌన్ అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పులివెందుల వ్యవసాయ సబ్‌డివిజన్‌కు సంబంధించి 4000 క్వింటాళ్ల సబ్సిడీ శనగ విత్తనాలు మంజూరైనట్లు ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.లింగాల మండలానికి 1100 క్వింటాళ్లు, పులివెందులకు 500 క్వింటాళ్లు, వేంపల్లికి 1000 క్వింటాళ్లు, వేములకు1400 క్వింటాళ్లు మంజూరైనట్లురైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనంతరం శనగలు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేటి నుంచి శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్

వల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి వల్లూరు మండలానికి సబ్సిడీలో 1800 క్వింటాళ్ల బుడ్డశనగ లు రాష్ట ప్రభుత్వం కేటాయించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేశారు. అదే విధంగా ఆదివారం నుంచి మూడు రోజులపాటు రైతు సేవా కేంద్రాల్లో కావలసిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా ఒక కిలో రేటు సబ్సిడీ పోను 58.50 పైసలుగా నిర్ణయించడం జరిగింది. మూడురోజుల పాటు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు.

కమలాపురం రూరల్..: కమలాపురం మండలంలో రబీ సీజన్ శనగ విత్తనాల పంపిణీకి ఆదివారం నుంచి మంగళవారం వరకు రిజిస్ట్రేషన్లు ఆయా పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో జరుగుతాయని ఏవో ఎం.సరస్వతి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని శనగ విత్తనాలు కావాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ నెంబరు తీసుకెళ్లి బయోమెట్రిక్ ద్వారా శనగ విత్తనాలు పొందగలరని తెలిపారు.

పెండ్లిమర్రి..: మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం ఏవో సుమంత్‌రెడ్డి బుడ్డ శనగ పంపిణీపై సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి రిజిస్ట్రేషన్ మొదలు అవుతుందన్నారు.కావలసిన రైతులు ఆధార్,పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను మొబైల్ ఫోన్ తీసుకుని ఆర్‌బీకేలో సంప్రదించాలని తెలిపారు.

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి



మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కమలాపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న వరి పంటలో మొలకలు రాకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం కమలాపురం మండలంలో, అధిక వర్షాలకు దెబ్బతిన్న వివిధ పంటలను శాస్త్రవేత్తలు సీనియర్ సైంటిస్ట్ కె.అంకయ్య, ప్రాజెక్టు కోఆర్డినేటరు యాస్మిన్‌తో కలిసి పరిశీలించారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు



పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

సింహాద్రిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో శనివారం సింహాద్రిపురం జెడ్పీహైస్కూల్‌లో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా ప్రథమ స్థానంలో రావులకొలను జెడ్పీహైస్కూల్ విద్యార్థి ఎస్ అక్షయ, ద్వితీయ స్థానంలో హిమకుంట్ల జెడ్పీహైస్కూల్ డి నాగవైష్ణవి, సింహాద్రిపురం జెడ్పీహైస్కూల్ విద్యార్థి కె అభినయశ్రీ ఎంపికయ్యారు. ఇక్కడ ఎంపికైన విజేతలు ఈ నెల 29వ తేదీన నియోజకవర్గ స్థాయిలో పోటీలలో పాల్గొంటారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన విజేతలకు అసెంబ్లీలో పాల్గొనే సువర్ణ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాదికారి-1 ఖాదర్‌బాషా, విద్యాశాఖాధికారి-2 శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప క్రైం..: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు కుటుంబాల చిన్నారులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మహిళలు,పిల్లలను లైంగిక వేధింపుల నుంచి రక్షించడంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించారు. పోటీలను ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పోలీసు కుటుంబాల విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరు..: మహిళలకు జరిగే నేరాలు, వాటి కట్టడి నివారణపై విద్యార్థులకు అవగాహన కలిగేలా స్థానిక సీఐ క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ అంజనేయుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపకులపతి జయరామిరెడ్డికి సత్కారం



జయరామిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కడప కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఉప కులపతిగా నియమితులైన ఆచార్య జయరామిరెడ్డిని శ్రీక్రిష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి ఆచార్య మాచిరెడ్డి రామక్రిష్ణారెడ్డి, వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కడపజిల్లా రచయితల సంఘం కార్యవర్గసభ్యులు మధురకవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు మనోహర్‌రావు, రామప్రసాద్‌రెడ్డి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నకలీ మద్యం గుర్తించేందుకు
సురక్ష యాప్ ఎంతో ఉపయోగం



పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

కడప క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం గుర్తించేందుకు సురక్ష యాప్ ఎంతో ఉపయోగపడుతుందని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. కడప నగరానికి వచ్చిన ఆయన కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డితో కలిసి ఆయన శనివారం సురక్ష యాప్ పోస్టర్లనువిడుదల చేశారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు కడప ఎం.జయరాజ్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసరు రవికుమార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు కడప క్రిష్ణకుమార్ పాల్గొన్నారు. అనంతరం కడప ఎమ్మెల్యే మాధవీ చేతుల మీదుగా పోస్టర్లను విడుదల చేశారు. డిప్యూటీ కమిషనరు జయరాజు అనంతరం కొన్ని షాపులను పరిశీలించి వినియోగదారులకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా ప్రభుత్వ సరఫరాలోని మద్యం నాణ్యతను ఎలా తనిఖీ చేయాలో వివరించారు.

ఎంబీఏ విద్యార్థులకు వీసీ ప్రశంసలు



విద్యార్థులను ప్రశంసిస్తున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన నేషనల్ మేనేజ్‌మెంట్ మీట్ ఎక్సెల్ సీఆర్ 2025లో రాణించిన విద్యార్థులను వైస్ చాన్సలర్ ప్రొఫసర్ బెల్లంకొండ రాజశేఖర్ అభినందించారు. ఎక్సెల్ సీఆర్ 2025లో ఫైనాన్స్ ఈవెంట్, హెచ్‌ఆర్ ఈవెంట్ ఈ రెండింటిలోనూ మూడో బహుమతిని గెలుచుకున్నారు. ఫైనాన్స్ ఈవెంట్ విజేతలు సుజిత, దివ్య, భాగ్యలక్ష్మి హెచ్‌ఆర్ ఈవెంట్ విజేతలగా నిలిచిన రమేశ్, అల్లంబీ, మహిర్ ఆలీలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ ప్రశంసించారు.

'కాంట్రాక్టును రద్దుచేసుకునేలా ఒత్తిడి తెస్తున్నారు'

కడప రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : కడప సీడబ్ల్యూసీ హెచ్‌టీ కాంట్రాక్టును 2025 జూలై నెలలో ప్రభుత్వం తమకు కేటాయించిందని అయితే ఇది వరకు ఉన్న కాంట్రాక్టు నిర్వాహకులు వారికి రాలేదనే ఉద్దేశంతో కాంట్రాక్టును రద్దుచేసుకొనేలా రకరకాలుగా ఇబ్బందులు పెడుతూ ఒత్తిడి తెస్తున్నారని సీడబ్ల్యూసీ హెచ్‌టీ కాంట్రాక్టర్ ఆర్.ఎన్. సంజీవరాయుడు ఆరోపించారు. కడప మార్కెట్ యార్డు సమీపంలోని సీడబ్ల్యూసీ గోడౌన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తమకు సీడబ్ల్యూసీ హెచ్‌టీ కాంట్రాక్టు వచ్చిన నాటి నుంచి ఏదో ఒక సమస్య తెస్తూ కాంట్రాక్టును రద్దుచేసుకొనేలా చేస్తున్నారన్నారు.ప్రతి చిన్న విషయాన్ని పెద్దదిగా చేసి హమాలీలను పనిచేయకుండా ఆటంకం కలిగిస్తున్నారన్నారు.

ఎస్ఐగా మోహన్ కుమార్ గౌడ్

పెండ్లిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల ఎస్ఐగా మోహన్ కుమార్ గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రజలకు అందుబాటులో ఉండి, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తియాప్

కడప క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్ అని ఎస్ఐ శాంతమ్మ అన్నారు. శక్తియాప్‌పై మహిళలు, బాలికలకు యాప్ ప్రాముఖ్యతను వివరించడంలో భాగంగా శనివారం మధ్యాహ్నం నగరంలోని జేఎంజే హైస్కూలు, ఉదయం ఎర్రముక్కపల్లెలోని సుమ లేడీస్ హాస్టల్‌లోని మహిళలకు, సాయంత్రం వసతిగృహంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులు, చిన్నారులు, మహిళలపై జరిగే నేరాల గురించి వివరించారు.

దేవదాయమంత్రికి ఘనస్వాగతం

చెన్నూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పొలతల క్షేత్రంలో పాలక మండలి ప్రమాణ స్వీకారానికి వస్తున్న సందర్భంగా చెన్నూరులో మండల టీడీపీ కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఆయనను సత్కరించారు. అలాగే టీడీపీ నేత ఆకుల చలపతి మాట్లాడుతూ చెన్నూరు ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూమి ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లె రెవెన్యూ పరిధిలోని సర్వేనెం.51/1 లో ఉందని ఈ స్థలాన్ని కొంతమంది కొంత కాలంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని తక్షణం ఆలయ భూమిని కబ్జా చేసిన వ్యక్తుల నుంచి తిరిగి ఆలయానికి వచ్చేట్లు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, రామన శ్రీలక్ష్మి, సీనియర్ టీడీపీ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, షబ్బీర్‌హుస్సేన్, మన్నెమోహన్‌రెడ్డి, సుధాకరరెడ్డి, సుభానీ, ఆకుల ప్రసాద్‌బాబు, కొక్కిరాయపల్లె నాగేశ్వర్‌రెడ్డి, కె.నాగేశ్వర్‌రెడ్డి, టి.వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడండి..: మండలంలోని కొన్ని దేవాలయాల భూములు గత కొన్నేళ్లుగా కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటూ లబ్ధి పొందు తున్నారని పైగా వాటిపై తప్పుడు రికార్డులు సృష్టించారని చెన్నూరుకు చెందిన రైతులు చదిపిరాళ్ల ప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, ఆకుల చలపతి దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కన్వీనరు ఆజాద్ చంద్రశేఖర్‌కు విన్నవించారు. దీంతో ఆర్‌జేసీ అక్కడే ఉన్న అసిస్టెంటు కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఈవో శ్రీనివాసులును పిలిచి తక్షణచర్యలు చేపట్టాలని ఆదేశించారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

చెత్తరహిత నగరంగా కడప



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరాన్ని ఆదర్శనగరంగా చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో వెల్‌బీయింగ్ అవుటాఫ్ వేస్ట్ కార్యక్రమం ద్వారా చెత్త సేకరణ ప్రారంభమవుతుందని కడప ఎమ్మెల్యే మాధవి తెలిపారు. శనివారం కడప నగరం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని తడి చెత్త, పొడి చెత్త హానికర చెత్తలను వేర్వేరు వాహనాల ద్వారా సేకరించేందుకు డ్వాక్రాసంఘాలకు చెందిన వంద మంది మహిళలను స్వచ్ఛమిత్రలుగా నియమించామన్నారు. చెత్త ద్వారా సంపద సృష్టించాలన్నా సీఎం చంద్రబాబు ఆలోచనలో భాగంగానే కడప నగరాన్ని ఐటీసీ సంస్థకు దత్తతగా ఇచ్చినట్లు తెలిపారు. నగర ప్రజలందరూ చెత్తనురోడ్లపై, కాల్వల్లో వేయకుండా తడి పొడి చెత్తలను వేర్వేరు సంచుల్లో వేసి చెత్త సేకరించే వాహనాలకు ఇవ్వాలని కోరారు.

సీఎం సహాయనిధి పంపిణీ..: కడప నియోజకవర్గ పరిధిలో 28 మంది లబ్ధిదారులకు 19లక్షలు విలువ చేసే సీఎం సహాయనిధి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనవర్వహాక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, నగర అధ్యక్షుడు మన్సూరు ఆలీఖాన్, అధికార ప్రతినిధి జిలానీబాష , సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా వైసీపీదే హవా

ప్రభుత్వ బిల్డింగులున్నా ప్రైవేటు వాటిల్లో సచివాలయాలు
బాడుగల పేరుతో దోపిడీలు ● టీడీపీ నేత గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న గోవర్ధనరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ప్రభుత్వం మారినా వైసీపీ వారిదే హవా కొనసాగుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ బిల్డింగులు ఖాళీగా ఉన్నాప్పటికీ వైసీపీ మద్దతుదారుల ఇళ్లల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని విమర్శించారు. శనివారం కడప నగరం బసవతారకం లా కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప కార్పొరేషన్ పరిధిలో 101 సచివాలయాలు ఉన్నాయన్నారు. వాటిలో 50శాతానికి పైగా వైసీపీ మద్దతుదారుల ఇళ్లల్లో బాడుగలు చెల్లిస్తూ కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ బిల్డింగులు ఖాళీగా ఉన్నప్పటికీ కూడా వాటిలో కొనసాగించకుండా ఉన్నారన్నారు. పాత రిమ్స్ ప్రభుత్వ బిల్డింగులో ఉన్నా జిల్లా రిజిస్టరు కార్యాలయాన్ని వైసీపీ మద్దతుదారులైన బుద్ధటౌన్‌షిప్‌లోకి మార్చి కోట్లలో బాడుగలు ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. అలాగే జడ్పీ స్థలంలో ఓ వైసీపీ మద్దతుదారుడు పర్మినెంటు బిల్డింగు నిర్మాణం చేసి హోటల్ కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురప్ప, శివశంకర్‌రెడ్డి, శ్రీను, లోకేశ్ పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు

- నెలలోపు భూకబ్జా ఆక్రమణలు వెలికితీయాలి
- భూ ఆక్రమణకు గురైన భూముల జాబితా సిద్ధం చేయాలి
- అధికారులను ఆదేశించిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా



బ్రహ్మంసాగర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టాసుధాకరయాదవ్, ఆర్డీవో చంద్రమోహన్ తదితర అధికారులు, నాయకులు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు బనాయిస్తామని నెలలోపు భూ ఆక్రమణలను వెలికితీసి జాబితా సిద్ధం చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకరయాదవ్ పేర్కొన్నారు. శనివారం బ్రహ్మంగారిమఠం మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, డిప్యూటీ కలెక్టరు, మండల ప్రత్యేక అధికారి శిరీషా, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, తహసీల్దారు కె.కార్తీక్‌తో పాటు వీఆర్వోలు, సర్వేయర్లు హాజరయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యే పుట్టా మాట్లాడుతూ జిల్లాలోనే ఎక్కువ భూ ఆక్రమణలకు గురైన మండలంగా బ్రహ్మంగారిమఠం జాబితాలో ఉందని, ఈ మండలంలో అర్హులైన పేదలకు భూములు లేకుండా భూ ఆక్రమణదారులు వందల కొద్దీ భూములను ఆక్రమించుకున్నారన్నారు. ఆర్డీవో తహసీల్దారు, వీఆర్వో సంతకాలను ఫోర్జరీ చేసి భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారన్నారు. తమ దృష్టికి 2450మంది దొంగ పట్టాలను ఎక్కించుకుని 4,890 ఎకరాలను భూ ఆక్రమణ చేశారన్నారు. ఈ జాబితాను సంబంధిత ఆర్డీవో చంద్రమోహన్, తహసీల్దారు కార్తీక్ అందిచండం జరిగిందన్నారు. నెలరోజులు గడువులోపు భూ ఆక్రమణలకు గురైన భూములను భూ ఆక్రమణదారుల జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గతంలో శాసనసభ సమావేశాల్లో బ్రహ్మంగారిమఠం మండలంలో ఎక్కువశాతం భూ ఆక్రమణకు గురైందని సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. అలాగే గ్రామ స్థాయి నుంచి సర్వేయర్లు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి ఖచ్చితమైన జాబితా నెలరోజుల్లో సిద్ధం తెలిపారు. డిప్యూటీ కలెక్టరు, మండల ప్రత్యేకాధి కారి శిరీషా వారానికి ఒకసారి రెవెన్యూ అధికారులతో సమావేశమై వారం రోజుల్లో నిర్వహించిన సర్వే జాబితాను తమకు పంపాలని ఎమ్మెల్యే కోరారు. రానున్న రోజుల్లో బ్రహ్మంగారిమఠం మండలంలో అర్హులైన పేదలకు రెండు ఎకరాల చొప్పున భూ పంపిణీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రజలందరూ కూడా తమకు సహకరించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీఅధ్యక్షుడు చెన్నుపల్లెసుబ్బారెడ్డి, మండల యువనాయకుడు కాణాల మల్లికార్జునరెడ్డి సర్వే డీటీ సాంబశివారెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ యల్లటూరు సాంబశివారెడ్డి రెవెన్యూ సిబ్బంది, సర్పంచ్ నారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, అధికారులు

తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టును శనివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఆర్డీవో చంద్రమోహన్, ఎంపీడీవో వై.రామచంద్రారెడ్డి, ప్రత్యేకాధికారి శిరీషా, తహసీల్దారు కె.కార్తీక్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాత్రికేయులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ప్రతి పంటకు నీటిని అందించేందుకు సీఎం చంద్రబాబునాయుడు అనేక ప్రాజెక్టులను నెలకొల్పుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ఏఈఈ ముద్దం నాగేశ్వర్‌రావుయాదవ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శనగల కోసం పేర్లు నమోదు చేసుకోండి

ఎర్రగుంట్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో శనగవిత్తనాల తీసుకునేందుకు రైతులు వారి పేర్లు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏవో సుజనకుమారి తెలిపారు. ఎర్రగుంట్ల మండలానికి 2250క్వింటాళ్ల శెనగవిత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. 25శాతం సబ్సిడీతో రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. పట్టాదార్‌పాస్‌బుక్కు, ఆధార్‌కార్డు, మొబైల్‌ఫోన్ తీసుకెళ్లి బయోమెట్రిక్‌ద్వారా శెనగ విత్తనాలు పొందగలరన్నారు. జే.జీ11 రకం క్వింటాల్ పూర్తి ధర రూ.7800కాగా ప్రభుత్వ రాయితీ రూ.1950 ఇస్తున్నట్లు తెలిపారు. పాసు బుక్కులో పేరున్న రైతులు మాత్రమే రైతు సేవాకేంద్రం వద్దకు వెళ్లాలన్నారు. ఒక ఎకరాకు 40కేజీలు, రెండెకరాలకు 80కేజీలు, అంతకు పైబడిన వారికి 100కేజీలు మాత్రమే ఇస్తారన్నారు. ఆసక్తి గల రైతులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ముద్దనూరులో: మండలంలో శెనగ సాగు చేసే రైతులు ఆదివారం నుంచి సబ్సిడీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఏవో వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు.25శాతం సబ్సిడీతో శెనగలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. క్వింటా ధర రూ.7800 కాగా రూ.1950 సబ్సిడీ పోను రైతు వాటా రూ.5850 చెల్లించాలన్నారు.సంబంధిత రైతు సేవా కేంద్రంలో శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

కొండాపురంలో రేపటి నుంచి..

కొండాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి సబ్సిడీ శెనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఏవో ఏవీ రామాంజులరెడ్డి తెలిపారు. మండలానికి 1300 క్వింటాళ్ల శెనగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారానే డబ్బులు చెల్లించాలన్నారు.బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

మైదుకూరు అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గానికి చెందిన 50 మంది బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి కింద రూ56,75,200 చెక్కులను మైదుకూరు ఎంఎల్‌ఏ పుట్టా సుదాకర్ యాదవ్ పంపిణీ చేశారు. శనివారం ప్రొద్దుటూరులోని ఎంఎల్‌ఏ క్యాంపు ఆఫీసులో బాధితులకు ఆయన చెక్కులు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముడియం ప్రసాద్,బురుగోల్ల చిన్న, శెట్టివారిపల్లి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎర్రగుంట్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు దెబ్బతిన్న వరిపంటను కడప ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.సునీల్‌కుమార్, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ అంకయ్యకుమార్, శాస్త్రవేత్త యాస్మిన్‌లు శనివారం పరిశీలించారు. ఎర్రగుంట్ల మండలంలోని ఇల్లూరులో వర్షానికి పడిపోయిన వరిపంటకు మొలకలు రాకుండా లీటరు నీటికి 5గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేసుకోవాలని సూచనలిచ్చారు. నల్లగింజ, పాముపొడతెగులు, పొట్టకుళ్లు, మాగుడు తెగులురాకుండా ప్రొపికానాజోలు 200మిల్లీ లీటర్స్ ఒక ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. ఈవాతావరణానికి దోమపోటు అధికంగా ఉందని నివారణకు పైమెట్రోజిన్120 గ్రాములు ఒక ఎకరానికి పిచికారి చేయాలన్నారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఏవో సుజనకుమారి, వీఏఏలు పాల్గొన్నారు.

పొలాల సందర్శన

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలో సాగవుతున్న పంటలకు వ్యాపించే చీడపీడల నివారణకోసం వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు వరి పొలాల సందర్శనను చేపట్టారు. శనివారం మండల పరిధిలోని కామనూరు గ్రామంలో ఏడీఏ అనిత, ఏవో వరాహరికుమార్, కేవీకే విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ అంకయ్య, డాక్టర్ సునీల్‌లు వివిధ పంటలను పరిశీలించారు. వరి పొలాలకు వ్యాపించే తెగుళ్లు, వాటి నివారణకోసం వాడే మందులను రైతులకు వివరించారు.

టెట్ పరీక్ష ఫీజుతగ్గించాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీటెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని ప్రైవేటు టీచర్స్, లెక్చలర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డంరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 24న విద్యాశాఖ జీవోనెం.1 ద్వారా టెట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు ప్రతి పేపర్‌కు వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాలనడం తగదన్నారు. ఒక్కో పేపర్‌కు వెయ్యి రూపాయలు నిరుద్యోగ అభ్యర్థులకు భారంగా మారిందని తెలిపారు. పోటీ పరీక్షల్లో ఫీజు మినహాయింపు ఇచ్చినట్లే టెట్‌లోనూ ఫీజు మినహాయింపు ఇవ్వాలని, ఓసీ అభ్యర్థులకు రూ.500 ఫీజు నిర్ణయించాలని కోరారు. అలాగే టెట్ దరఖాస్తులో తప్పులను ఉచితంగా సవరించే అవకాశం కల్పించాలన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీనేత

కలసపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండల టీడీపీ నేత సూర్యనారాయణరెడ్డి శుక్రవారం దుబాయ్‌లో సీఎం చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బద్వేలును కడప జిల్లాలోనే కొనసాగించాలని సూర్యనారాయణరెడి సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. బద్వేలు నియోజకవర్గం వెనకబడి ఉందని అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రారంభమైన కార్తీక మాస పూజలు

బ ద్వేలు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసియున్న స్వయంభు లక్ష్మినరసింహస్వామి దేవస్థానంలో కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. శివ,కేశవులకు ప్రీతిపాత్రమైన ఈ మసాన్ని పురస్కరించుకుని ఆలయంలోని లక్ష్మినరసింహ స్వామి, లక్ష్మిదేవి అమ్మవారికి అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వెండి ఆభరణాలతో ప్రత్యేక అలంకణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తదుపరి అన్నదాన కైంకర్యం నిర్వహించారు. వల్లెరవారిపల్లె గ్రామానికి చెందిన గుర్రంపాటి వెంకటరెడ్డి,, లక్ష్మిదేవి వారి కుటుంబ సభ్యులు పలువురు ప్రముఖులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శక్తియాప్ మహిళలకు వజ్రాయుధం

బద్వేలుటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : శక్తియాప్ యువతకు వజ్రాయుధం లాంటిదని ఎస్‌ఎస్‌ఎస్ యూనియన్ సమన్వయకర్త డాక్టర్ ఎం.దొరసామి నాయక్, శక్తియాప్ టీంసభ్యుడు మురళీలు పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని చెన్నకేశంపల్లెలో ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న అరాచకాల నుంచి తప్పించుకోవడానికి ఈ శక్తియాప్ ఎంతో ఉపయోగపడుతుందని వారన్నారు. మహిళలు ఈ శక్తియాప్‌ను డౌన్‌లోడ్‌చేసుకొని ఆపదసమయాల్లో ఉపయోగించుకొని సమస్యలనుంచి బయటపడవచ్చని తెలిపారు.

వేగవంతంగా స్వామిత్వ సర్వే

రాజుపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లోని ఇళ్లు, రోడ్లు, ఖాళీ స్థలాలను స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారిణి నూర్జహాన్ సూచించారు. శనివారం మండల సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతవారంలో ఏరువపాలెం గ్రామాన్ని స్వామిత్వ సర్వే చేశామన్నారు. ఈ వారంలో మరో ఏడు పంచాయతీలకు స్వామిత్వ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామాల అభివృద్ధికి నీటి పన్ను, తదితర వాటిని వసూలు చేసిపంచాయతీలను బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షాకర్ ఆలీఖాన్ గ్రామ పంచాయాతీ అధికారులు పాల్గొన్నారు.

అమర వీరుడికి ఘన నివాళి

కలసపాడు అక్టోబరు25(ఆంధ్రజ్యోతి)మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన అమర వీరుడు పామూరు సుబ్బారెడ్డికి శనివారం 11వ బెటాలియన్ పోలీసులు కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. 2000 సంవత్సరంలో అనంతపురం జిల్లాలో నక్సలైట్ల ఎదురుకాల్పుల్లో సుబ్బారెడ్డి వీరమరణం పొందారు. పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా కడప ఏపీఎస్‌పీ 11వ బెటాలియన్ పోలీసులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో బెటాలియన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ నాగరాజు,హెడ్ కానిస్టేబుల్ ఆవులరెడ్డి,సుబ్బారెడ్డి అమరవీరుని భార్య రమణమ్మ, టీడీపీ నాయకుడు రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ నేతలకు అవగాహన సదస్సు

జమ్మలమడుగు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శనివారం వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల గ్రామ, మండల, నియోజకవర్గ జిల్లా కమిటీలు ఏర్పాటు చేశారు. వారందరికి సంస్థాగత అవగాహన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా వైసీపీ నేత భాస్కర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కమిటీలో ఉన్నవారు గ్రామాల్లో ఉన్న సమస్యలను మండలస్థాయికి అక్కడి నుంచి నియోజకవర్గస్థాయి తీసుకెళ్లడం, కలిసికట్టుగా పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కన్నెలూరు రుషికేశవరెడ్డి, మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, జగదీశ్వరరెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, బోనం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని ఈనెల 27న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీబిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చిన్న ఓబన్న పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన క్లైంలకు నిధులను మంజూరు చేయాలని కోరారు. కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో వివిధ రంగాల కార్మికులు జయప్రదం చేయాలని కోరారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాకతీయ కమ్మవారి అన్నదాన సత్రంలో ఆదివారం స్వర్గీయ డాక్టర్ నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నామని కమిటీసభ్యులు పీరయ్య, గద్దె కాశయ్య, ద్రోణాదుల అంజయ్య, పామిడి రమణయ్య, వెంకటేశ్వర్లు, కేశవరావు, గంటా పుల్లారావు అన్నారు. వారు శనివారం మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కోసం మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, వస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

పోరుమామిళ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల స్మరిస్తూ స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు వక్తృత్వపోటీలు నిర్వహించారు.శనివారం ఆ కళాశాలలో ఎస్‌ఐ కొండారెడ్డి సలహా మేరకు అధ్యాపకుడు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో మహిళలు,పిల్లలను లైంగిక వేధింపుల నుంచి రక్షించడంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యుల్ డేవిడ్‌రాజ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎస్‌ఐ మూర్తి హాజరయ్యారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు రోడ్డుపై వెళుతున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి సూచించారు. శనివారం జమ్మలమడుగులోని సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాలలో న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశంలో జడ్జి మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. విద్యార్థులు చదువుపట్ల శ్రద్ధ వహించాలని చెడు వ్యసనాలపై దూరంగా ఉండాలని సూచించారు. బార్ అసోసియేషన్ సెక్రటరి, న్యాయవాది మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టవిరుద్ధమన్నారు. రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి మురళీ నాయక్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహన లైసెన్సు, ఫిట్‌నెట్ సర్టిఫికెట్లు తదితర రికార్డులు అన్నీ దగ్గర ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు భూతమాపురం సుబ్బారావు, సూర్యపెద్దిరాజు, నాగార్జునరెడ్డి, మాధవి, కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ క్రిష్ణమోహన్‌రెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ రాజగోపాల్

ప్రొద్దుటూరు టౌన్‌లో: రోడ్డు ప్రమాదాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం శ్రీవిద్యాజూనియర్ కళాశాలలో ట్రాఫిక్, బైక్ యాక్సిడెంట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులు స్పోర్ట్స్ బైక్‌లను ఎటువంటి లైసెన్సు లేకుండా విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారన్నారు. మితిమీరిన వేగంతో వెళ్లి ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులకు బైకులు ఇచ్చి కళాశాలకు పంపరాదని సూచించారు. బైక్ నడిపేటప్పుడు లైసెన్సు, రిజిస్ట్రేషన్, హెల్మెట్ లేకుంటే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రామమోహన్, ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజికుంటలో పీ4 బృందం పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున పీ4 బృందం

మైదుకూరు రూరల్,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజికుంట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలను స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యవర్గంలోని పువ్వాడి వినోద్‌కుమార్ పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను, ఒక రిపోర్టుగా తయారు చేసి అమరావతిలోని రాష్ట్ర కార్యాలయానికి నివేదిక పంపనున్నట్లు వినోద్ కుమార్ తెలిపారు.

చెరువుకు పడిన గండిని పూడ్చిన అధికారులు



చెరువుకు పడ్డ గండిని ఎక్స్‌కవేటరుతో పూడుస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అట్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని కొండూరుకు పడమటి బాగాన ఉన్న మర్రిమానుకుంట చెరువుకు శుక్రవారం పడిన గండిని అధికారులు పూడ్చించారు. చెరువులోని నీరు వృథాగా పోవడంతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తా కథనానికి అధికారులు స్పందించి ఎక్సకవేటరుతో తాత్కాలికంగా గండిని పూడ్చి నీటిని అదుపు చేయడం జరిగిందని ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. దెబ్బతిన్న కాంక్రీట్ వాల్‌కు తెలుగుగంగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శేషుబాబు శనివారం పరిశీలించారు. గుత్తేదారుడు మరమ్మతులు చేపడతా మని తెలిపారు. గుత్తేదారుడు నాశిరకంగా పనులు చేపట్టడంతతో కాంక్రీటు సైడ్ వాల్ దెబ్బతినడం జరిగిందని వెంటనే కాల్వపై నిర్మించిన బ్రిడ్జికి సైడ్ వాల్‌ను పునరుద్ధరిం చడం జరుగుతుందని ఈఈ తెలిపారు. కార్యక్రమంలో తెలుగుగంగ ఏఈ శ్రీనివాసులు, అట్లూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టరు రమణ, వీఆర్వో దొరబాబు, వీఆర్ఏ శ్రీనువాసులు పాల్గొన్నారు.

నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు క్యూఆర్ కోడ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం తాగ కుండా గుర్తించేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను పెట్టిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నకిలీ మద్యం నిరో ధించడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్‌పై ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో మద్యం తాగేవారికి సెల్‌ఫోన్ పై అవగాహన ఉండదని అలాంటి వారు నకిలీ మద్యం గుర్తించలేక నష్టపోయి ఆరోగ్యాలు పాడు అవుతాయన్నారు. అలాం టి వారి కోసం మద్యం దుకాణాల వద్దే వాటిని తనిఖీ చేసే వీలుకల్పించాలన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రతి మద్యం దుకాణంను ప్రతి రోజు తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా నిబంధనల ప్రకారం ఉద యం10 గంటలకు తెరవాల్సివుంటే తెల్లవారుజామునే 5 గంటలకే మద్యం దుకాణాలు తెరుస్తున్నారన్నారు. వాటన్నింటిని అధికారులు అరికట్టాలన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, ఈవీ సుధాకర్ రెడ్డి , టౌన్‌బ్యాంక్ చైర్మన్ బీవి సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలకేంద్రంలోని స్థానిక కందిమల్లయ్యపల్లె ప్రాథమిక పాఠశాలలో కీచక ఎల్‌ఎఫ్‌ఎంఎల్ కీచక ప్రధానోపాధ్యాయుడు రాధాక్రిష్ణమూర్తిని వెంటనే సస్పెండ్ చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అఖిలభారత విద్యార్థి బ్లాక్‌జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని కోరుతూ శనివారం బి.మఠం మండల ఎంఈవో పుల్లయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందిమల్లయ్యపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాక్రిష్ణమూర్తి 5వతరగతి చదువుతున్న విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు విద్యార్థినులు తమ దృష్టికి తీసుకువచ్చారని వారు తెలిపారు. అభం శుభం తెలియని చిన్నారులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడం దారుణమన్నారు. వెంటనే అతనిపై అధికారులు చర్యలు తీసుకుని పోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పురమిత్ర యాప్‌పై అవగాహన



పురమిత్ర యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బద్వేలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం పురమిత్ర యాప్‌పై మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. . ఈసందర్భంగా కమిషనర్ మాటట్లాడుతూ పురమిత్ర యాప్ గురించి ఎస్‌హెచ్‌జీ మెంబర్లతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పీఎం స్వానిధి లోన్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మనమిత్ర ద్వారా అందే వాట్సాప్ సేవల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో మేనేజర్ , ఆర్‌ఐ మెప్మా సీఎంఎం, సీవోలు పాల్గొన్నారు.

సివిల్ ఇంజనీర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానం

ఎర్రగుంట్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మున్సిపాలిటీలో ఏపీడీపీఎంఎస్ పోర్టల్ కింద భవన ప్రణాళికల తయారీకి లైసెన్సు పొందిన సాంకేతిక వ్యక్తులుగా నియమించుకోవడానికి సివిల్ ఇంజనీర్స్ నుంచి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు కమిషనర్ పి.శేషఫణి తెలిపారు. టౌన్‌ప్లానింగ్ పనుల్లో అనుభవం ఉండి ఆసక్తిగల వారు ఈనెల 27వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత గల అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్ల కాపీలతో, అనుభవ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.